సాక్షి
చిత్తూరు
గురువారం । 13 । జూలై । 2023



పాల ఉత్పత్తిలో ప్రథమ స్థానం

పాల ఉత్పత్తిలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా సమష్టిగా పనిచేయాలని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. - 8లో



లేగదూడల ప్రదర్శన

సోమల మండలం పెద్ద ఉప్పరపల్లెలో లేగదూడల ప్రదర్శన జరిగింది. ఉత్తమ దూడల రైతులకు బహుమతులు అందించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	25
తిరుపతి	36	26
తిరుమల	31	21
గూడూరు	37	27
నగరి	35	26

న్యూస్‌రీల్

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

చిత్తూరు రూరల్: పుట్టిన ప్రతి బిడ్డకు విధిగా వ్యాధి నిరోధక టీకా వేయించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ప్రభావతిదేవి సూచించారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డిజిటల్ సొల్యూషన్ ఫర్ వ్యాక్సినేషన్ అనే కార్యక్రమంపై వైద్యులు, సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పిల్లలకు అందించే వ్యాధి నిరోధక టీకాల వివరాలను ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. తద్వారా టీకాలు వేసే ప్రక్రియ సులభతర మవుతుందన్నారు. ఆగస్టు నుంచి చేపట్టనున్న ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేయవచ్చని ఆమె పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమ శిక్షకులు డాక్టర్ రవిరాజు శిక్షణను ప్రారంభించారు. మూడు రోజుల పాటు ఈకార్యక్రమం సాగుతుందని ఆయన తెలిపారు.

బోయకొండలో ట్రైనీ కలెక్టర్లు



ఆలయంలో సందీప్, అఖిల

చౌడేపల్లె: కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్య దైవంగా పేరు గాంచిన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయాన్ని బుధవారం ట్రైనీ కలెక్టర్‌లు సందీప్, అఖిల దర్శించుకున్నారు. దేవస్థానం ఈఓ చంద్రమౌళి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ చరిత్ర, విశిష్టతను అర్చకులు వివరించారు. పవిత్ర తీర్థ ప్రసాదాలను అందజేశారు. తహసీల్దార్ మాధవరాజు, ఆర్‌ఐ సుధాకర్ నాయక్ పాల్గొన్నారు.

రెండో విడత ఐటీఐ అడ్మిషన్లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో రెండవ విడత అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కన్వీనర్ రవీంద్రారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 7 ప్రభుత్వ, 10 ప్రైవేట్ ఐటీఐ కళాశాలలున్నట్లు చెప్పారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు అడ్మిషన్లకు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆగస్టు 3న ప్రభుత్వ కళాశాలలకు, 5 నుంచి 7వ తేదీ వరకు ప్రైవేట్ కళాశాలల అడ్మిషన్లకు కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 7799679351, 7799933370 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

రేషన్ పంపిణీ వేగవంతం



శంకరన్, డీఎస్‌ఓ

చిత్తూరు రూరల్: జిల్లా లో రేషన్ పంపిణీని వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల ప్రారంభం నుంచి రేషన్ పంపిణీలో బియ్యంతో పాటు చక్కెర, రాగులు, పట్టణ ప్రాంతాల్లో గోధుమపిండి కూడా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు 50శాతం పంపిణీ పూర్తయిందన్నారు. ఈనేపథ్యంలో ప్రతిరోజూ పంపిణీ ప్రక్రియను పర్యవేక్షిస్తూ వేగం పెంచేలా మండల అధికారులు, డీలర్లు, ఎండీఎం ఆపరేటర్లకు ఆదేశాలిస్తున్నామని చెప్పారు. ఈనెల 17వ తేదీ నాటికి పంపిణీ 90 శాతం దాటేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

మహిమాన్వితం.. మెట్లోత్సవం



తిరుపతి కల్చరల్ : తిరుమల శ్రీవారి దర్శనార్థం ఎందరో మహనీయులు నడచివెళ్లిన మెట్ల మార్గం మహిమాన్వితమైందని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో అలిపిరి పాదాల మండపం వద్ద మెట్లోత్సవం వేడుకగా నిర్వహించారు. ముందుగా దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థా చార్యులు, శ్రీనివాసులు కలిసి మెట్ల పూజ ప్రారంభించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ పూర్వం పురంధరదాసు, శ్రీవ్యాసరాజయతీశ్వరులు, అన్నమాచార్యులు, శ్రీకృష్ణదేవరాయలు వంటి మహనీయులు భక్తి ప్రపత్తులతో తిరుమల కొండలను అధిరోహించి స్వామివారి వైభవాన్ని దశ దిశలా వ్యాప్తి చేశారన్నారు. వారి అడుగుజాడల్లో నడిచి ఆ దేవదేవుని కృప కు పాత్రులు కావాలనే తలంపుతో తిరుమల తిరుపతి దేవస్థానం మెట్లోత్సవాన్ని జరిపిస్తోందని వివరించారు.

ఐరాలలో పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం



శాంతిపురంలో మానవహారం



కార్వేటినగరంలో వలంటీర్ల నిరసన ర్యాలీ



మిన్నంటిన నిరసనలు

అజ్ఞానవాసి ఎలాంటి అవగాహన లేకుండా తమపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నాడని సేవా సైన్యం మండిపడింది. నిస్వార్థ సేవలు అందిస్తున్న వలంటీర్లపై పవన్ కల్యాణ్ అనుచిత మాటలను నిరసిస్తూ బుధవారం కూడా జిల్లా వ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. పవన్ దిష్టి బొమ్మలను చెప్పులు, చీపుర్లతో కొడుతూ ర్యాలీ నిర్వహించి, దహనం చేశారు. తమకు భేషరతుగా క్షమాపణలు చెప్పేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని వలంటీర్లు స్పష్టం చేశారు.

– చిత్తూరు అర్బన్

- పవన్ వ్యాఖ్యలపై వెనక్కి తగ్గని వలంటీర్లు
- జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలు
- పవన్ దిష్టిబొమ్మల దహనం.. క్షమాపణలకు డిమాండ్



శ్రీరంగరాజపురంలో పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం



బైరెడ్డిపల్లెలో పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు



పలమనేరులో నిరసన ర్యాలీ

- గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని పెనుమూరు, వెదురుకుప్పం, గంగాధరనెల్లూరు, శ్రీరంగరాజపురం, పాలసముద్రం మండలాల్లో పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా మానవ హారం నిర్వహించారు. పవన్ దిష్టిబొమ్మను చెప్పులు, చీపుర్లతో కొడుతూ దహనం చేశారు. పవన్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గంగాధరనెల్లూరు, పెనుమూరు పోలీస్ స్టేషన్లలో వలంటీర్లు ఫిర్యాదులు చేశారు.
- పలమనేరు బస్టాండు కూడలి, వి.కోట అంబేడ్కర్ కూడలి వద్ద వలంటీర్లు పెద్ద సంఖ్యలో నిరసన వ్యక్తం చేశారు. మానవహారం నిర్వహించి పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రజలకు సేవ చేసే పోలీసు కుటుంబం నుంచి వచ్చానని చెబుతున్న పవన్.. తమపై బురదజల్లడం మంచిదికాదన్నారు.
- పూతలపట్టు నియోజకవర్గంలోని ఐరాల, కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం, గుడుపల్లెలో వలంటీర్లు రోడ్లపైకి వచ్చి.. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్యాకేజీలు తీసుకునే పవన్ తమపై నోటికొచ్చినట్లు మొరిగితే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

దత్తపుత్రుని మాటలకు బాబే సమాధానం చెప్పాలి

గంగవరం: మేము ప్రభుత్వంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను తీసేస్తాం, సచివాలయాల వ్యవస్థను రద్దు చేయాలంటూ కోర్టుకెళ్తానని చెబుతున్న దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ మాటలపై చంద్రబాబే సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. గంగవరంలో బుధవారం ఆయన ఎంపీ రెడ్డెప్పతో కలసి మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ మదమెక్కి నోటికొచ్చినట్టు వలంటీర్లపై వ్యాఖ్యలు మంచిది కాదన్నారు. ఇప్పటికే ఆయన మాటలపై రాష్ట్రంలోని వలంటీర్లు చెప్పులు, చీపుర్లతో ఆయన దిష్టిబొమ్మలను కొడుతూ, దహనాలతో బుద్ధి చెబుతున్నా సిగ్గులేకుండా పోతోందని ఆరోపించారు. కేవలం చంద్రబాబు డైరెక్షన్‌లోనే పవన్ పిచ్చిపట్టిన వాడిలా రెచ్చిపోతున్నారని ఆరోపించారు. ఏపీలోని సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను పలు రాష్ట్రాలు ప్రశంసిస్తూ అక్కడ అమలు చేస్తామని చెబుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉండే సేవలను రద్దు చేస్తామని చెప్పే ధైర్యం చంద్రబాబుకు ఉందా, ఉంటే ధైర్యంగా చెప్పాలని సవాల్ విసిరారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పక్కన ఎంపీ రెడ్డెప్ప

రాష్ట్ర సరిహద్దు వరకు రోడ్లు భేష్

- కౌండిన్య అభయారణ్యంలో అనుమతులు లేవు
- టీడీపీ హయాంలో మంత్రిగా అమరనాథరెడ్డి ఒక్క రోడ్డూ వేయలేదు
- వాస్తవాలను మరుగునబెట్టి విషం చిమ్మిన 'ఈనాడు'
- ఎమ్మెల్యే వెంకటేగౌడ చొరవతో రహదారి పనులు



రాళ్లు తేలిన రహదారులే దిక్కు

ఈనాడులో ప్రచురితమైన కథనం



బైరెడ్డిపల్లె-ధర్మపురి మార్గంలో వేసిన తారురోడ్డు

బైరెడ్డిపల్లె : ఆంధ్ర రాష్ట్ర సరిహద్దు వరకు రహదారులు బ్రహ్మాండంగా ఉన్నాయి. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఆటంకం లేకుండా రహదారుల నిర్మాణాలు ముమ్మరంగా చేపట్టారు. బైరెడ్డిపల్లె మండలం నెల్లిపట్ల మీదుగా తమిళనాడు లోని పేర్నంబట్‌కు వెళ్లేందుకు దాదాపు 5 కిలోమీటర్ల మేర అంతర్రాష్ట్ర రహదారి నిర్మాణం కోసం అటవీశాఖ అభ్యంతరాలు ఉన్నాయి. ఏళ్ల తరబడి అనుమతుల కోసం పోరాటం చేస్తున్నా కేంద్ర అటవీశాఖ నిరాకరిస్తుంది. కౌండిన్య అభయారణ్యం కావడంతో ఏనుగులు అధికంగా సంచరిస్తుంటాయి. దీంతో కేంద్ర అటవీశాఖ అనుమతులు ఇవ్వక పోవడంతో రహదారి పనులు చేపట్టలేక పోతున్నారు. ఏనుగులు సంచరించే ప్రాంతం కావడంతో రహదారి ఏర్పాటు చేస్తే ప్రాణనష్టాలు సంభవించే అవకాశం ఉంటుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. వాస్తవాలను మరుగున బెట్టి ప్రభుత్వంపై విషం చిమ్మేందుకు ఈనాడు పత్రికలో 'రాళ్ల తేలిన రహదారులే దిక్కు' శీర్షికన ప్రచురితమై కథనంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. అసలు విషయానికి వస్తే తెలుదేశం పాలనలోనే రహదారులు దుస్థితికి చేరాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రహదారుల నిర్మాణలు వేగవంతం అయ్యాయి.

మాజీ మంత్రి అమర్ ప్రగల్భాలు

టీడీపీలో అమరనాథరెడ్డి మంత్రిగా కొనసాగిన రోజుల్లో అంతరాష్ట్ర రహదారులు ఏర్పాటు చేస్తామని ప్రగల్భాలు పలికారు. కేంద్రం మెడవంచైనా రహదారుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టి ప్రజలకు సౌకర్యంగా రోడ్లు వేయిస్తామని ప్రకటించారు. మంత్రిగా తన పదవి కాలంలో ఒక్క రోడ్డు కూడా వేయలేదు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బైరెడ్డిపల్లె నుంచి మోట్లపల్లె వరకు వెళ్లే రహదారిని అభివృద్ధి చేస్తోంది. గత ప్రభుత్వంలో గుంతలు పడిన ఈమార్గంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడేవారు. అప్పట్లో మంత్రి అమరనాథరెడ్డి దృష్టికి తీసుకువచ్చినా అతీగతీ లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే ఎస్.వెంకటేగౌడ చొరవ తీసుకొని రహదారి పనులు చేపట్టారు. ఈ మార్గంలో కొంత మేరకు అటవీశాఖ అనుమతులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. మిగిలిన మార్గం పూర్తయి రాకపోకలకు అనుకూలంగా ఉన్నాయి. ఈ విషయమై అటవీశాఖ ఉన్నతాధికారి శివన్నను వివరణ కోరగా, అంతరాష్ట్ర రహదారులు కేంద్ర అటవీశాఖ పరిధిలో ఉన్నాయని, కేంద్రం అనుమతులతో రహదారి నిర్మాణాలు చేపట్టాలన్నారు.దట్టమైన అటవీప్రాంతం, జంతువులు నివాసం ఉంటుండడంతో అనుమతులు ఇవ్వలేకపోతున్నట్లు వివరించారు.



ధర్మపురి వద్ద అటవీ అనుమతులు లేక నిలిచిన పనులు



నెల్లిపట్ల-పేర్నంబట్ అటవీప్రాంతం వద్ద తారురోడ్డు

ఆఖరి మజిలీకి అన్నీ తామై..!

- కోవిడ్ మృతులకు అంత్యక్రియలు జరిపించిన వలంటీర్లు
- అందరూ భయపడుతున్న తరుణంలో మేమున్నామంటూ సేవలు

రెండేళ్ల క్రితం కోవిడ్ మహమ్మారి విజృంభిస్తున్న వేళ.. వైరస్ బాధితులు రోజురోజుకూ పెరుగుతున్నారు. ఎక్కడ చూసినా రెడ్‌జోన్లు.. నిర్మానుష్యంగా వీధులు.. ఇంట్లో నుంచి బయటకు కదిలే పరిస్థితి లేదు.. ఎవరినైనా తాకాలంటే భయం.. ఇక కరోనా బారిన పడి మరణించినవారికి అంత్యక్రియలకు కూడా ఎవరూ ముందుకురాని దుస్థితి. మృతుల కుటుంబీకులు సాయం కోసం పిలిస్తే సొంత బంధువులు కూడా ముఖం చాటేసే రోజులు. ఆ సమయంలో వలంటీర్లు మొక్కవోని ధైర్యంతో విశేష సేవలందించారు. మృతదేహాలను దగ్గరుండి ఆఖరి మజిలీకి చేర్చారు. అన్నీతామై ఆత్మబంధువులుగా నిలిచారు.

– పలమనేరు

కోవిడ్ సెకెండ్ వేవ్.. మే 2021 లాక్‌డౌన్ అమల్లో ఉంది. పలమనేరు పట్టణంలోని ఆది ఆంధ్రవీధికి చెందిన జమున(50) అనే మహిళ దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతోంది. ఆమెకు ఓ కుమార్తె మినహా ఇంకెవరూ లేరు. ఓ రోజు హఠాత్తుగా జమున తన ఇంట్లోనే మరణించింది. కుమార్తె తన తల్లి అంత్యక్రియలకు సహకరించమని బంధులను ప్రాధేయపడింది. ఎవరూ ముందుకు రాకపోవడంతో తల్లడిల్లిపోయింది. ఈ విషయం తెలుసుకున్న రంగాపురం వార్డు సచివాలయ వలంటీర్ మైఖేల్ సురేష్ వెంటనే స్పందించాడు. స్థానిక గాంధీనగర్ శ్మశానవాటికకు చెందిన కొందరిని తీసుకువచ్చాడు. మృతురాలి బంధువుల్లో ఇద్దరితో మాట్లాడి వారికి ధైర్యం చెప్పి ఒప్పించాడు. జమునకు సంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు జరిపించి మానవత్వం చాటుకున్నాడు. అందరితోనూ శభాష్ అనిపించుకున్నాడు.



వృద్ధురాలి మృతదేహాన్ని ఖననానికి తరలిస్తున్న వలంటీర్(ఫైల్)

జేసీబీలు రాని సమయంలో..

పలమనేరు సమీపంలోని సాయినగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నేత బద్రి కోవిడ్ కారణంగా 2021 మేలో మృతి చెందాడు. అతడి స్వగ్రామం కొలమాసనపల్లెలో అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబీకులు సన్నద్ధమయ్యారు. అయితే ఖననానికి గుంత తవ్వేందుకు జేసీబీ దొరకలేదు. అడిగినంతా ఇస్తామని నచ్చజెప్పినా జేసీబీ నిర్వాహకులు ముందుకు రాలేదు. ఇదే పరిస్థితి సంబార్‌పూర్‌లో ఓ వ్యక్తి కోవిడ్‌తో మృతి చెందితే తలెత్తింది. బ్యాంకర్స్ కాలనీలోనూ ఓ మహిళ మృతి చెందితే ఖననం చేసేందుకు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో వలంటీర్లే సేవలందించారు. సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ మృతులను ఆఖరి మజిలీలకు చేర్చారు. గౌరవప్రదంగా అంత్యక్రియలు జరిపించారు.



సంబార్‌పూర్‌లో ఖననానికి గుంత తవ్విస్తున్న వలంటీర్, సచివాలయ సిబ్బంది(ఫైల్)

ఎన్నటికీ మరువలేం



మా ఇంటి పక్కనే ఉన్న జమునమ్మ మృతి చెందింది. ఆమెకు ఓ కుమార్తె మాత్రమే ఉంది. జమునమ్మకు అంత్యక్రియలను నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. అలాంటి సమయంలో మా వార్డు వలంటీర్ మైఖేల్ అన్నీ తానై వ్యవహరించాడు. సొంత మనుషులు పట్టించుకోకున్నా దగ్గరుండి అంత్యక్రియలు జరిపించాడు. అలాంటి విపత్కర పరిస్థితుల్లో మైఖేల్ అందించిన సేవలను ఎన్నటికీ మరువలేం.

– ప్రవల్లిక, ఆదిఆంధ్ర వీధి, పలమనేరు

కుటుంబీకులుగానే భావిస్తా



నా వార్డు పరిధిలోని 50 కుటుంబాలను నా సొంత కుటుంబీకులుగా భావిస్తా. సేవచేయాలనే ఆలోచనతోనే వలంటీర్‌గా చేరా. డబ్బు సంపాదన కోసం ఇందులోకి రాలేదు. కోవిడ్ సమయంలో మృతదేహాలకు అంత్యక్రియలు చేయలేదంటే తట్టుకోలేక పోయేవాడిని. అందుకే నేనే ప్రత్యేక చొరవ తీసుకుని సేవలందించా. నాకు ఈ తృప్తి చాలు.

– మైఖేల్ సురేష్, వలంటీర్, పలమనేరు

జిల్లా ఆస్పత్రిలో పెరిగిన ప్రసవాలు

చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు పెరిగాయి. జూన్ 28 నుంచి జూలై 4వ తేదీ వరకు 60 ప్రసవాలు, ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకు 102 ప్రసవాలు చేశారు. ప్రసూతి వార్డు బాలింతలతో నిండిపోయింది. బెడ్లు సరిపడక పోవడంతో కొత్త భవనంలోని ఆర్థోపెడిక్ వార్డుకు 19 మంది బాలింతలను మందిని షిఫ్ట్ చేశారు.

క్లుప్తంగా

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

గంగవరం: బెంగళూరు నుంచి పలమనేరుకు గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి, రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి బుధవారం తెలిపారు. పోలీసులు అప్పినపల్లి క్రాస్ వద్ద వాహనాలను సాధారణ తనిఖీలు చేస్తుండగా పలమనేరు గంటావూరుకు చెందిన సతీష్, పెద్దపంజాణి మండలం అప్పినపల్లెకు చెందిన చంద్రశేఖర్ రెడ్డి బైక్‌పై వేగంగా వెళ్లడంతో అనుమానం వచ్చి పట్టుకొన్నారు. మోటార్‌బైక్‌ను పరిశీలించగా గంజాయి దొరికింది. వీరిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సారా స్వాధీనం- ఇద్దరి అరెస్టు

సదుం: సారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మారుతి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. మండలంలోని ఎర్రాతివారిపల్లెకు చెందిన నరసింహారెడ్డి, పార్వతమ్మ సారా విక్రయిస్తున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు బుధవారం సాయంత్రం దాడి చేశారు. వారి నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, ఇద్దరినీ అరెస్టు చేశారు.

ప్రీఆడిట్‌తో అభ్యంతరాలకు చెక్

- పారదర్శకతకు పెద్దపీట
- రాష్ట్ర డైరెక్టర్ హరిప్రకాష్



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ హరిప్రకాష్, పక్కన ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు: ప్రభుత్వ కార్యాలయాలలో ప్రీ ఆడిట్ ప్రక్రియను విజయవంతంగా అమలు చేస్తున్నామని, అలాగే ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అభ్యంతరాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఆడిట్ డైరెక్టర్ హరిప్రకాష్ స్పష్టం చేశారు. బుధవారం చిత్తూరు ఎంపీ రెడ్డెప్పతో కలసి జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, అకౌంటెంట్లు, ఆడిట్ ఉద్యోగులకు మున్సిపల్ కార్యాలయంలో జిల్లా ఆడిట్ అధికారి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. డైరెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో కూడ ప్రీఆడిట్‌ను చేపట్టి పారదర్శకంగా నిలిచేలా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ప్రీ ఆడిట్‌ను ప్రస్తుతం అన్ని విభాగాల్లో చేపట్టామన్నారు. తద్వారా పోస్ట్ ఆడిట్‌పై వచ్చే అభ్యంతరాలకు చెక్ పెట్టేందుకు వీలుంటుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి అందే కోట్లాది రూపాయల ఖర్చును ముందే ప్రీ ఆడిట్ చేయడంతో ఉద్యోగులపై ఒత్తిడి తగ్గుతుందన్నారు. పని తర్వాత ఆడిట్ చేయడం సాధారణంగా జరుగుతుందన్నారు. కానీ ప్రభుత్వం ప్రీ ఆడిట్ కార్యక్రమాన్ని చేపట్టడంతో అక్రమాలకు తావుండదని పేర్కొన్నారు. ఆడిట్ శాఖ పకడ్బందీగా లెక్కలు చూస్తుందని, వీటిని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా కూడా చేపడుతుందని తెలిపారు. శాశ్వతంగా ఆన్‌లైన్ విధానమే అమలు చేస్తామన్నారు. ఆడిట్ సిబ్బందిపై ఆరోపణలు వస్తే చర్యలకు వెనుకాడే ప్రసక్తేలేదన్నారు. ముఖ్యంగా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఆడిట్ అభ్యంతరాలకు సంతృప్తికరంగా సమాధానం ఇస్తే అభ్యంతరాలను రద్దు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. దీనిపై అధికారులు, ఉద్యోగులతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్లు నరసింహప్రసాద్ రెడ్డి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పెన్షన్ కోసం సాఫ్ట్‌వేర్ ..

ఉద్యోగ విరమణ చేసే ఉద్యోగులకు పింఛన్‌ను ఆన్‌లైన్‌లో ఒక రోజు ముందుగా జమ చేసేలా నూతన సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నామని ఆడిట్ డైరెక్టర్ హరిప్రకాష్ తెలిపారు. ఈ సాఫ్ట్‌వేర్‌ను ఏజీ కార్యాలయం వారితో సంప్రదించి, అనుసంధానం చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. తద్వారా ఆలస్యం లేకుండ చెల్లింపులు జరుగుతాయని తెలిపారు.

సీఆర్టీల జాబ్‌చార్ట్ పేరు మార్పు

చిత్తూరు కలెక్టరేట్:విద్యాశాఖ, సమగ్రశిక్ష శాఖ పరిధిలో సీఆర్టీల జాబ్‌చార్ట్, పేరును మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ ఉత్తర్వులను కలెక్టర్, డీఈవో, సమగ్రశిక్ష శాఖ ఏపీసీలకు ప్రభుత్వం పంపింది. ఆ ఉత్తర్వుల మేరకు సీఆర్‌పీల పేరును క్లస్టర్ మొబైల్ రిజర్వ్ టీచర్‌గా మార్పు చేశారు. ఏకోపాధ్యాయ పాఠశాలల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏకోపాధ్యాయ ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల్లో పనిచేసే టీచర్లు సెలవులో ఉన్నప్పుడు సీఎంఆర్‌టీలు ప్రత్యామ్నాయ టీచర్లుగా విధులు నిర్వహించనున్నారు. జాబ్‌చార్ట్ వివరాలను ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,420
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,000
రిటైల్ వెండి గ్రాము	రూ.73.00

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి


శంకర్రాయలపేటలో సూచనలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, పక్కన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పెద్దపంజాణి: మండలంలో అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ మండలంలో విస్తృతంగా పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా జెడ్పీ చైర్మెన్ శ్రీనివాసులతో కలసి శంకర్రాయలపేట సచివాలయాన్ని తనిఖీ చేశారు. అప్పినపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. టెస్ట్ కాంపోనెంట్ పనులను వేగవంతం చేయాలన్నారు. బసవరాజుకండ్రిగ సమీపంలోని జగనన్న హౌసింగ్ లేఔట్లను తనిఖీ చేశారు. లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టకపోతే పట్టాలు రద్దు అవుతాయని, త్వరలో పనులను ప్రారంభించి పూర్తి చేయాలని తెలిపారు. చివరగా రాయలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి సిబ్బంది, ఫార్మశీ, ల్యాబ్ సదుపాయాలపై ఆరా తీశారు. ఆస్పత్రి ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. బోరు మోటరు మరమ్మతులు చేపట్టాలని ఎంపీడీఓ భాస్కర్‌ను ఆదేశించారు. ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యురాలు సుష్మకీర్తి, స్థానిక సర్పంచ్ హరినాథ్, తహసీల్దార్ లోకేశ్వరరావు, ఎంపీడీఓ భాస్కర్ పాల్గొన్నారు.

ఇలాగేనా పరిశుభ్ర నిర్వహణ..?

పుంగనూరు: మండలంలోని గూడూరుపల్లె జెడ్పీ హైస్కూల్‌లో పారిశుద్ధ్య నిర్వహణపై కలెక్టర్ షణ్మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టర్ గూడూరుపల్లె హైస్కూల్, కపాడంమిట్టపల్లె సచివాలయం, జగనన్న కాలనీ నిర్మాణాలను ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్‌తో కలసి పరిశీలించారు. పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని హెచ్‌ఎం మహేష్ నారాయణపై మండిపడ్డారు. శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు.



పాల ఉత్పత్తిలో ప్రథమస్థానం

చిత్తూరు అగ్రికల్చర్: పాల ఉత్పత్తిలో జిల్లాకు గత వైభవాన్ని తీసుకువచ్చి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ తెలిపారు. బుధవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో స్థానిక మ్యాంగో భవనంలో జరిగిన పశుగ్రాస వారోత్సవాల కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పాడి పశుపోషణకు రైతులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. పాల ఉత్పత్తిలో నాణ్యతకు చెప్పుకోదగ్గ గుర్తింపు ఉందని తెలిపారు. పాల ఉత్పత్తిలో గత వైభవాన్ని తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగానే విజయా డెయిరీ నిర్వహణను అమూల్ సంస్థకు అప్పగించినట్లు తెలిపారు. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో మంచి దాణా అందించేందుకు అవసరమైన మెలకువలను పశుగ్రాస వారోత్సవాల్లో పాడి రైతులకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఎక్కువ పోషకాలు ఉండే పచ్చగడ్డి పెంపకం చేపట్టి పశువులకు దాణాగా అందించడం ద్వారా పాల ఉత్పత్తి పెరిగి రైతుకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు.

14 వరకు పశుగ్రాస వారోత్సవాలు

పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ పశుగ్రాసం పెంపకంపై ఆవశ్యకత, అవగాహన కోసం ఈనెల 7నుంచి జరుగుతున్న పశుగ్రాస వారోత్సవాలకు మంచి స్పందన లభిస్తోందని, ఈనెల 14 వరకు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో గడ్డి విత్తనాలు, టీఎంఆర్, గడ్డి కత్తిరించే యంత్రాలను ఆర్బీకేల ద్వారా రాయితీపై పాడి రైతులకు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ చైర్మన్ సంతోష్ కుమార్, ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ గంగరాజు, పలమనేరు రీసెర్చ్ స్టేషన్ సైంటిస్ట్ డాక్టర్ అరుణ, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి దారుణహత్య

- బంగారు చైను, గాజుల అపహరణ
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన అడిషనల్ ఏఎస్పీ శ్రీలక్ష్మి, డీఎస్పీ


అనసూయమ్మ(ఫైల్)


గ్రామస్తులను విచారణ చేస్తున్న అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి

తవణంపల్లె: ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలిని గుర్తు తెలియని దుండగులు కత్తితో విచక్షణారహితంగా గొంతు కోసి హత్య చేసి పరారైన సంఘటన బుధవారం మండలంలోని ఎగువ మారేడుపల్లెలో చోటు చేసుకుంది. గ్రామస్తుల సమాచారం మేరకు చిత్తూరు అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి, సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్య ఘటనపై ఆరా తీశారు. హత్య జరిగిన ఇంటి దగ్గర క్లూస్ టీం వేలిముద్రలను సేకరించారు. అదేవిధంగా డాగ్ స్క్వాడ్ హత్య జరిగిన ఇంటి నుంచి ఎగువమారేడుపల్లె చెరువు వరకు వచ్చి కుక్కలు ఆగిపోయాయి. స్థానిక పోలీస్ స్టేషన్‌లో చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి వృద్ధురాలి హత్యకు సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఎగువమారేడుపల్లెకు చెందిన డి.కృష్ణమనాయుడు, డి.అనసూయమ్మ(75) దంపతులకు ముగ్గురు సంతానం. ఇద్దరు కొడుకులు నాగరత్నం నాయుడు పుణేలో, మురళినాయుడు హైదరాబాద్‌లో, కుమార్తె వరలక్ష్మి చిత్తూరు నగరంలో నివాసం ఉంటోంది. భర్త మరణానంతరం అనసూయమ్మ ఇంటిలో ఒంటరిగా ఉంటోంది. అయితే బుధవారం గుర్తు తెలియని దుండగులు అనసూయమ్మ ఇంట్లో మంచంపై పడుకుని నిద్రిస్తుండగా నోటిలో గుడ్డ కుక్కి కత్తితో గొంతు కోసి హతమార్చారు. ఆమె మెడలోని బంగారు చైను, చేతిలో గాజులు ఎత్తుకెళ్లారు. ఇంటి అల్మారాలో దుస్తులు చిందరవందగా పడిఉన్నాయి. అయితే అల్మారాలో నగదు, బంగారు ఉన్నట్లు అనసూయమ్మ కుమార్తె వరలక్ష్మి ఫిర్యాదు చేసిందన్నారు. డాగ్‌స్క్వాడ్, వేలిముద్రల ఆధారంగా వివిధ కోణాల్లో కేసు విచారణ చేసి, దుండగులను పట్టుకుంటామని స్పష్టం చేశారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాలను అరికట్టవచ్చని సూచించారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. మృతురాలు కుమార్తె వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

లేగ దూడల ప్రదర్శన


మాట్లాడుతున్న ఉప సంచాలకుడు బాల సుబ్రమణ్యం

సోమల: మండలంలోని పెద్ద ఉప్పరపల్లెలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం లేగ దూడలను ప్రదర్శించారు. దూడలకు పుట్టినప్పటి నుంచి సరైన పోషకాహారం అందిస్తే మంచి పాడి ఆవులుగా పెరుగుతాయని అధికారులు అవగాహన కల్పించారు. 33 దూడలు ప్రదర్శనలో పాల్గొనగా, ఉత్తమంగా ఎంపిక చేసిన ఐదు దూడల యజమానులకు బహుమతులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గంగాధరం, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు బాలసుబ్రమణ్యం, నగిరి, సోమల సహాయ సంచాలకులు వాసు, శ్రీనివాసులు నాయుడు, వైద్యాధికారులు చందనప్రియ, కల్యాణ్‌రామ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గణపతి, జిలాని పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత


నిందితుడి అరెస్ట్ చూపుతున్న సెబ్ అధికారులు

పలమనేరు: పలమనేరు సెబ్ పరిధిలోని గొర్రెలదొడ్డి క్రాస్ వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి, 50 టెట్రా ప్యాకెట్లును, బైక్‌ను సీజ్ చేసినట్టు డీటీఎఫ్ చిత్తూరు టీమ్ సీఐ మాధవస్వామి బుధవారం తెలిపారు. నిందితుడు పలమనేరు మండలం జంగాలపల్లెకు చెందిన చిన్నబ్బ(39)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ మస్తాన్‌వళి, సిబ్బంది శ్రీనాథ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు : నలుగురికి గాయాలు

పలమనేరు: పట్టణసమీపంలోని పెద్దచెరువు కట్టపై పలమనేరు– కుప్పం రహదారిలో బుధవారం బైక్‌ను బస్సు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. గంగవరం మండలం గోవిందు శెట్టిపల్లికి చెందిన ఇద్దరు సొంతపనిపై బైక్‌లో పలమనేరుకు బయలుదేరారు. వీరు కట్టపైకొచ్చేసరికి బైక్‌ను తిరుపతి నుంచి కుప్పానికి వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌లోని గోవిందుశెట్టిపల్లికి చెందిన రాజేంద్ర(28), నవీన్(20), బస్సు ఉన్నట్టుండి బ్రేక్ వేయడంతో బస్సులోని తిరుపతికి చెందిన సుభాషిణి(28), మునెమ్మ(48) గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో సిబ్బంది బాబాజాన్, నగ్మా స్థానిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

మామిడి వ్యాపారులకు రూ.51 లక్షల టోకరా

చిత్తూరు అర్బన్: కట్టమంచిలోని వ్యవసాయశాఖ మార్కెట్ యార్డులో మామిడి వ్యాపారం చేస్తున్న పది మంది వ్యాపారులకు శ్రీనగర్‌కు చెందిన ముగ్గురు కుచ్చుటోపీ పెట్టారు. సీఐ మద్దయ్య ఆచారి కథనం మేరకు.. కట్టమంచిలోని మామిడికాయల మార్కెట్‌లో నందగోపాల్‌నాయుడు మరో పది మంది వ్యాపారుల నుంచి కశ్మీర్ రాష్ట్రంలోని శ్రీనగర్‌కు చెందిన ఖుర్షిద్ అహ్మద్, నజీర్ అహ్మద్, హమీద్ అనే ముగ్గురు ట్రేడర్లు గత రెండు నెలలుగా మామిడి కాయలు కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన సరుకుకు కొంత మేరకు నగదు చెల్లించి తీసుకెళుతున్నారు. ఈ క్రమంలో 42 లారీల మామిడి కాయలను తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించి రూ.51 లక్షలను చెల్లించలేదు. వ్యాపారులు అడిగితే, ఇప్పుడే చెల్లిస్తానంటూ చెబుతూ సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేశారు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు.

వినాయకునికి బంగారు విభూది పట్టి బహూకరణ


బంగారు వీభూది పట్టి


ఆలయ ఈఓ వెంకటేశుకు బంగారు విభూది పట్టీని అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారికి కృష్ణా జిల్లా, గుడివాడకు చెందిన వేంకటేశ్వరస్వామి అనే దాత బంగారు విభూది పట్టిని బహూకరించారు. ఉదయం దాత కుటుంబ సభ్యులతో కలసి స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. ఈ సందర్భంగా రూ.4.50 లక్షల విలువైన సుమారు 100 గ్రాముల బంగారు విభూది పట్టిని కాణిపాకం ఆలయ ఈఓ వెంకటేశుకు అందజేశారు. వారికి ఆలయాధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ కృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పాల ఉత్పత్తి పెంపు


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పాల ఉత్పత్తి పెంపునకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని జేసీ చాంబర్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో పాడిపరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. జగనన్న పాలవెల్లువ పథకం అమలులో 101 ఏఎంసీలు పాల సేకరణ చేస్తున్నాయన్నారు. వి.కోట, రామకుప్పం, శాంతిపురం మండలాల్లో పాలసేకరణ జరుగుతోందని చెప్పారు. స్వయం సహాయక సంఘ మహిళలు ఆర్థిక సమృద్ధి సాధించేలా ప్రభుత్వం తోడ్పాటునిస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. డెయిరీ డెవలప్‌మెంట్ అధికారి రవిచంద్రన్ మాట్లాడుతూ ఈనెల 11న జిల్లాలోని 101 ఏఎంసీ (వి.కోట, రామకుప్పం, శాంతిపురం) మండలాల్లో 11,601 లీటర్ల పాల సేకరణ చేసినట్లు వివరించారు. డీఆర్‌డీఏ పీడీ తులసి మాట్లాడుతూ పాడిపోషణకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని స్త్రీ నిధి పథకం కింద అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ప్రభాకర్, కోఆపరేటివ్ అధికారి బ్రహ్మానందరెడ్డి, అమూల్ జిల్లా కోఆర్డినేటర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గోసంరక్షణ ట్రస్టుకు రూ.1.50 లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): హైదరాబాద్‌కు చెందిన దాతలు గోపరాజు, శ్రీరామమూర్తి, మణికొండ బుధవారం కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి గోసంరక్షణ ట్రస్టుకు రూ.1.50 లక్షల విరాళం ఇచ్చారు. దాతలు కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. ఆ సందర్భంగా ఆ మొత్తాన్ని ఆలయాధికారులకు అందజేశారు. ఆలయాధికారులు వారికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య


పుత్తూరు రూరల్: మృతుడి ఎడమ చేతిపై టాటూ

కుప్పంరూరల్: కుప్పం రైల్వేస్టేషన్ సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద రైలుకింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుప్పం హెడ్ కానిస్టేబుల్ నాగరాజు కథనం మేరకు.. కుప్పంమండలం, మోడల్ కాలనీకి చెందిన రవి కుమారుడు కాశీ (30)కి వివాహమై 6 సంవత్సరాలైంది. పిల్లలు లేరు. దీనిపై మనస్తాపానికి గురైన కాశీ ఇంట్లో తరచూ గొడవలు పడేవాడు. ఇదే క్రమంలో బుధవారం ఇంట్లో కలహాలతో మనస్తాపానికి గురయ్యాడు. కుప్పం రైల్వేస్టేషన్ సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద బెంగళూరు– చెన్నై ట్రాక్‌పై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు పోస్టుమార్టమ్ నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నాగరాజు చెప్పారు.

వడమాలపేట వద్ద గుర్తుతెలియని వ్యక్తి..

పుత్తూరు రూరల్: వడమాలపేట మండలం పూడి రైల్వే స్టేషన్ సమీపంలోని స్వర్ణముఖి బ్రిడ్జి వద్ద రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని రేణిగుంట రైల్వే పోలీసులు బుధవారం మధ్యాహ్నం గుర్తించారు. రైల్వే ఎస్‌ఐ ఎంవీ అనిల్‌కుమార్ కథనం మేరకు వివరాలు.. మృతుడికి సుమారు 35 ఏళ్ల వయస్సు ఉండవచ్చు. రైల్వే ట్రాక్‌పై మృతదేహం ముక్కలైన తీరును బట్టి ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. మృతుడి ఎడమ చేతి మణికట్టుపై హార్ట్ బీట్ టాటూ ఉంది. బ్లూ కలర్ నైట్ ప్యాంట్, లైట్ బ్లూ కలర్ టీ షర్ట్ ధరించి ఉన్నాడు. రేణిగుంట రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.